## ౬

# తొత్తుముండ చావు

పేటనమందుగుడు తొత్తులు మాఘబహుళ చతుర్దశినాటి యుదయం వీధంటే గుంపుగా పోతూవున్నారు. వాళ్ళవేషాలు అతివికారంగాను అతివిచారంతో కూడుకున్నవిగాను వొప్పించి నయి. అయినా కళ్ళల్లో ఆవారి కలవడిన హడావిడి ఆలాగే వున్నట్టుంది. ఆవాళ్ళ కళ్ళన్నీ యిటూఅటూ ఊగి తిరిగిపోతు న్నాయి. ఆ ఆదుర్దాలోనే "రత్తీ! రత్తీ!" అని మజోతొత్తు ఇంటితలుపు తట్టి "ఇంకా తొంగోని లెగలేదిది. రాత్రి ఎవడు కారసిల్లోడో!" అని అనుకొంటూ పోతున్నారు. వాళ్ళవెన కనే రత్తి తలుపుదీసి "ఏమర్రో! ఎందుకు?" అంది. "రాదే రాదే! మనకాంతం తెల్లారగట్ల చచ్చిపోయిందట. మోసు కెళ్ళే దిక్కున్నాక లేదట. ఎల్లావున్నశవం అలావుందట." అన్నారువాళ్ళు. రత్తి అదోవిధగా మారిపోయింది ఆమాట వినడంతోనే—

రత్తింకా లోపలకు వెళ్ళకుండా ఆ రత్తింట్లోంచి దాని మొగుడు వీరన్న యీతలకువస్తూ "నీవు లెగిసేముందు నన్ను లెగ్గొడితేం" అన్నాడు. "ఇప్పుడేగా లెగిసింది నేను; ఇప్పుడేగా

ఇడిసిపెట్టేవు నాచెంగు! ఇంతలోనే మఱిపంత్రా?" అంది రత్తి. అని "వీరన్నబావా, ఆళ్ళవీధిని మాకాంతం సచ్చిపోయిందట. దానిశవాన్ని మోసేవాళ్ళన్నా లేరంట. మావోళ్ళంతా ఆడోళ్ళ పరుగెత్తారు. నాగతీఅంతే సేస్తావా! నివ్వేమన్నా సూస్తావా నేస స్తేను?" అంది. వీరన్న ముసిముసినవ్వు నవ్వుతూ కండువా ముసుగేసుకొని "సచ్చినప్పుడు మాటగందా. నీవు సావవు. నీకేంభయంలేదులే." అంటూ తనదార్నే పోయినాడు. రత్తి గబగబా తనకోక ఆకోకక వదిలేసి మఱోకోక పాతది. కట్టుకొని, జుట్టు దులుపుకు మళ్ళీ జాలుముడిగా వేసుకొని వీథంట— "మాకాంతం ఎంతలోపోయింది. జబ్బన్నా చేసిందన్న సంగతి తెలేదు మాకెవ్వరికీ" అంటూ అనుకుంటూ వెళ్ళింది.

ఆడవాళ్ళు తొత్తులుగా అవడం సంసారస్త్రీలుగాని సంసారపురుషులుగాని హర్షించరు. కాని వాళ్ళని చూచినప్పుడు మాత్రం గుర్తించకమానరు. ఏమనా! "అదెట్టా పెట్టుకుందో మల్లెమొగ్గలు! అదెల్లా తొడుక్కుందో నీలినీలిరైకె! అదెల్లా నడుస్తూందో గజ్జెలగుర్రంలా" అని— కాని అదే వేషం భేషజం తీసేసుకొని చినిగిన చీరతో ఏకూర తెచ్చుకోడానికో పోతూవుంటే ఎవరూ చూడరు, ఒక్క ఎఱిగుండి కనిపెట్టుకొని వేచికాచియున్న కువిటులు తక్క—ఆలా ఎఱుక పడకుండా పోతూవుంది ఆఉదయం రత్తి. కూరక్కాదు— ఎందుకైతేం?— కాంతం స్వర్గస్తురాలైనందుకే— తెలిసికోవాలిసిందల్లా ఎఱుక పడకుండా పోతూవుందా లేదా అని.

కాంతం—గుమ్మంముందు—పాపం—చిరకాలం పడుపువృత్తి నడపినడపి ఎంతమంది ప్రాయంలోవాళ్లని పాడు చేసిందో, ఎంతమంది ప్రాభవం తానుతీసుకొందో? ఎంతైతేం? తుదకుచనిపోయింది. దానిశవం దానిగుమ్మంముందుకటుకెక్కించేరు దానిగుమ్మంఅంటే ఒకతడికెలగది తడికెలగుమ్మం. అద్దెయిల్లు—కాని అప్పచెల్లెళ్ళల్లా పదిపదిహేనుమంది తోడితొత్తులు గుమిగా మూగినారు. దానిశవంకేసి చూస్తూ జాలిపడ్డారు. "ఎత్తండర్రా! రేపు మనబతుకులూ అంతేనర్రా! ఎత్తండర్రా!" అంటూ నలుగురు వాళ్ళల్లోవాళ్ళే సోమీ కామీ మంగీ మూర్తి ఎత్తుకున్నారు. ముందు అగ్నిహోత్రం తాను పట్టుకుంటానంటూ, అప్పుడేవచ్చిన రత్తి హడావిడిపడితే, "దానికెంత ముచ్చటగా వుందో యీయండర్రా!" అంటూ ఇచ్చారు.—

అప్పటికి ఉదయం తొమ్మిదైంది. బాగా ఎండ చెట్లమీద్ది అరుగులమీదికూడా దిగింది. వీధంటే మోసుకుపోతున్నారు శవాన్ని.—

రత్తి మోసేవాళ్ళతో ఓసంగతి చెప్పింది. "ఈ కాంతం శవాన్ని దాన్నుంచుకొన్నవాళ్ళ యిళ్ళకాడ ప్రతీయింటికాడా దించండి" అని. "వాళ్ళమొహాలీడ్చ ఓ మొగాడూ కనబడ్డు ఇప్పుడు. కృతఘ్నులు. నా వీరన్నబావైతే యిల్లా శేస్తాడా?" అంది.

వెనకాతల వ, ఆరుగురు తొత్తులు నడుస్తున్నారు.

"ఎవరికైనాగాని భూమ్మీద ఉండేదేచావు. కాని ఎవరూ ఏడ్వనిచావు కీర్తే ధన్యమైంది, మామయ్యా!" అన్నాడు వీరన్న ఆ పీఠిపే తన ఇంటిఅరుగుమీద కూర్చుని తన మేన మామనతో —దూరాన్ని కాంతం శవాన్నిచూచి.—మరి సరిగ్గా శవం వీరన్న గుమ్మంముందుకు వచ్చింది. అక్కడే ముందుగా ఆగి "వీరన్నా! బావయ్యా! చూస్తావుఏమిటి?" అన్నారు వెనకాలున్న త్రో త్రుముండలు.

రత్తి కాపిలుపుతో ముఖం కందగడ్డైపోయింది. "ఇక్కడాపా రేం!" టంది తనచేతిలోని కుండనిప్పు ఏలా రగుల్తోందో అలా రగుల్తోంది దానిగుండె కొలిమి. "ఓసి దీంతస్సాగొయ్యా! నా వీరన్నబావనికూడా ఇది—కాంతం—తనవల్లో వేసి కొంది!" అని అనుకొంది. చేతిలో నిప్పుకుండ జారేసింది. అది వీరన్న ఇంటిగుమ్మంముందు పగిలిపోయి నిప్పుకణాలన్నీ రాజమార్గాన్నే చెల్లాచెదురయినయి.

మొట్టమొదట వీరన్నకు గుడ్లు చింతనిప్పులైపోయినాయి కాని కార్యం లేదనుకోని, అరుగుమీదున్న తన మేనమామ ఏమనుకుంటాడో అని, ఊరకే సన్నగా "పంపనే అది రత్తీ!" అన్నాడు. "నీ యింటిగుమ్మం అయిపోయింది. నాయింటి గుమ్మంముందైతే యీ కుండెడునిప్పులు నీ మొహాన్ని పోసి యుండేదాన్ని." అందిరత్తి. వీరన్న అన్నాడు "శాంతించు! ఇది పగలు, రాత్రిపూటకాదు" అని—.

రత్తికి గుడ్లంట నీరుతిరిగి శవంకేసి చూచిచూచి "కాంతం! కాంతం! నీవు చచ్చి స్వర్గాన్నున్నావు. ధన్యురాలివి. నాకో పాఠం నేర్పేవు. నేనీరోజునుంచి పసుపువృత్తి ఒదిలేసి సన్యాసినిగా మాఱిపోతున్నా! నా యీరన్నబావ నావాడే అనుకొన్నా! నీవాడే! నీవాడే!" అనిశపథం పూనింది—సాగేరు, మఱోనిప్పుకుండతో.

ఏంచేస్తాడు? వీరన్న వీధిలో నిప్పులెత్తుకు గుమ్మంముందు శుభ్రం చేసికొన్నాడు.



| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| -8-1931 | నరసాపురం | "వినోదిని"లో |